సాక్షి
నంద్యాల
బుధవారం ; 13 ; సెప్టెంబర్ ; 2023



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలాలయ ప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, క్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలు వీరభద్ర స్వామికి మంగళవారం పూజలు నిర్వహించారు.



క్లాస్ బయటే 'సెల్'

తరగతి గదుల్లో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ వినియోగాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రభుత్వ ఉత్తర్వులు అతిక్రమించే వారిపై చర్యలు తీసుకునేలా నిబంధనలు జారీ చేసింది. 8లో..



కేసీకి నీరు విడుదల

పాములపాడు: లాకీన్స్‌లా నుంచి తూడిచెర్ల ఎస్కేప్‌చానల్‌కు 120 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. నిప్పుల వాగు, అలగనూరు రిజర్వాయర్ల గేట్లు పూర్తిగా బంద్ చేశారు.

న్యూస్‌రీల్

గిరిజన గూడేల్లో పండ్లతోటల పెంపకం



మొక్కలు నాటుతున్న ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి, ఎంపీడీఓ మోహన్‌కుమార్

ఆత్మకూరు: గిరిజన చెంచుగూడేల్లో పండ్లతోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నామని ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. బైర్లూటీ చెంచుగూడెంలో మంగళవారం చెంచుగిరిజన భూముల్లో పండ్లతోటల పెంపకం కోసం పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగలూటి, బైర్లూటీ గూడేల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద 129 ఎకరాల్లో మామిడి తోటల పెంపకానికి భూములను గుర్తించినట్లు చెప్పారు. త్వరలో మామిడి మొక్కలు నాటి గిరిజనులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుతామన్నారు. మామిడి మొక్కల పెంచే గిరిజనులకు ప్రతి నెల నగదు చెల్లిస్తామన్నారు. అంతకుముందు బైర్లూటీ చెంచుగూడెంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌కుమార్, బైర్లూటీ సర్పంచ్ గురవమ్మ, ప్రాజెక్ట్ మేనేజర్ కేజీ నాయక్, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

14 వరకు వైఎస్ఆర్ పెన్షన్ కానుక

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాకు వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద రెండో విడతలో మంజూరైన కొత్త పింఛన్లకు బుధవారం నుంచి వార్డు, గ్రామ వలంటీర్లు నగదు పంపిణీ చేయనున్నారు. ఇందుకు అవసరమైన నిధులు విడుదల కావడంతో పంపిణీని ఈ నెల 14 వరకు పొడిగించారు. రెండో విడతలో మంజూరైన 12,218 పింఛన్లకు మంగళవారం రూ.3,46,60,500 విడుదలయ్యాయి. ఒకే నెలలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు 23,303 కొత్త పింఛన్లు మంజూరు కావడం విశేషం. ఇదిలా ఉంటే సెప్టెంబర్ నెలకు సంబంధించి అనివార్య కారణాలతో పింఛను తీసుకోని వారంటే 14లోపు తీసుకునే అవకాశం కల్పించారు.

18న వినాయక చవితి

మహానంది: ఈ ఏడాది వినాయకచవితి పర్వదిన తేదీపై సందిగ్ధత నెలకొందని, అయితే ఈనెల 18వ తేదీ రోజు పండుగ నిర్వహించుకోవాలని మహానంది దేవస్థానం వేదపండితులు రవిశంకర అవధాని మంగళవారం తెలిపారు. 18వ తేదీ సోమవారం ఉదయం 9.58 గంటలకు చవితి తిథి ప్రారంభమై 19వ తేదీన మంగళవారం ఉదయం 10.28 గంటలకు ముగుస్తుందన్నారు. కాబట్టి మధ్యాహ్న వ్యాపినీ కర్మకాలమని, తృతీయతో కలిసిన చవితి ప్రశస్తమన్నారు. దీంతో 18వ తేదీన మాత్రమే వినాయకచవితి పండుగ ఆచరించాలన్నారు. అందులో భాగంగానే మహానంది ఆలయంలో ఈ నెల 18వ తేదీన వినాయక చవితి వ్రతం, పూజలు నిర్వహిస్తామన్నారు.

పీజీ ప్రవేశానికి రిజిస్ట్రేషన్లు చేసుకోండి

కర్నూలు (న్యూసిటీ): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 2023-24 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందడానికి ఈనెల 20లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు తెలిపారు. ఎంఏ ఇంగ్లిషు, ఎకనామి క్స్, ఉర్దూ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, బాట నీ, జువాలజీ, ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ తదితర కోర్సుల్లో విద్యార్థులు చేరవచ్చన్నారు. ఆన్‌లైన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఈ నెల 13 నుంచి 22వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఈ నెల 27వ తేదీ సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. సీటు వచ్చిన వారు ఈనెల 29న రిపోర్ట్ చేసుకో వాలన్నారు. https://pgcet-sche.aptonline.in./APPGCETAలో రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు.

మట్టి గణపతి.. మనసా స్మరామి!

- ప్రకృతి హితంగా వినాయక చవితి
- ఉమ్మడి జిల్లాలో మట్టి ప్రతిమలకు పెరుగుతున్న ఆదరణ
- ప్రోత్సహిస్తున్న గణేష్ మహోత్సవ కేంద్ర సమితి
- 18 నుంచి వినాయక చవితి ఉత్సవాలు



- సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

కర్నూలులో మట్టి విగ్రహాన్ని తీసుకెళ్తున్న నిర్వాహకులు

కర్నూలు కల్చరల్: పండుగలెన్ని వచ్చినా వినాయక చవితంటే ఓ ప్రత్యేకత. పిల్లలు మొదలు పెద్దల వరకు ఒకటే సందడి. యువకుల గురించి చెప్పనవసరం లేదు. నవరాత్రులు ఘనంగా నిర్వహించేందుకు వారు పడే హడావుడి అంతా ఇంతా కాదు. మరో వారం రోజుల్లో వినాయక చవతి ప్రారంభం కానుంది. హంగూ ఆర్భాటాల సంగతి ఎలా ఉన్నా.. పర్యావరణానికి ముప్పు కలిగించేలా ఉత్సవాలు జరుగుతుండటం ఆందోళన కలిగించే విషయం. చివరకు పూజలందుకుంటున్న వినాయకుడు సైతం భక్తా నాకేంటి ఈ శిక్షా అని అనుకుని బాధపడేలా చేస్తున్నారు నిర్వాహకులు. వాస్తవ పరిస్థితులను పరిశీలించి నిర్వాహకులు తీరు మార్చుకొని పర్యావరణ హితంగా పూజలు చేస్తే ప్రకృతికి రక్షణ కల్పించిన వారవుతారని మేధావులు సూచిస్తున్నారు. శ్రీగణేష్ మహోత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు సైతం మట్టి వినాయక విగ్రహాలనే ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు.

పెరగనున్న విగ్రహాలు

వినాయక చవితి వేడుకల నిర్వహణలో రాష్ట్రంలోనే కర్నూలు నగరం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రస్తుతం 42వ సంవత్సరం వేడుకలను నిర్వహిస్తున్నారు. రెండు విగ్రహాలతో ప్రారంభమైన వినాయక చవితి ప్రస్థానం ఇప్పుడు 2,300 విగ్రహాలకు చేరుకుంది. దీంతో పాటు రాష్ట్రంలోనే అత్యంత ఎత్తయిన 57 అడుగుల భారీ మట్టి వినాయకున్ని సైతం ఏర్పాటు చేసుకొని ఎకో ఫ్రెండ్లీ వినాయకునికి జై కొడుతున్నారు. వినాయక చవితి అంటేనే సామూహికంగా ఐక్యంగా నిర్వహించుకునే పర్వదినం. ఈ పండుగ ప్రతి సంవత్సరం ఏదో ఒక కొత్తదనాన్ని సంతరించుకుంటూ ముందుకు సాగుతూ ఆదర్శవంతం అవుతుంది. ఈ ఏడాది మట్టి విగ్రహాల ఏర్పాటు గణనీయంగా పెరిగింది. సుమారు 700 వరకు మట్టి గణనాథులను ప్రతిష్టించుకోనున్నారు. కోల్‌కతా, గుజరాత్, రాజస్థాన్ నుంచి వచ్చిన శిల్ప కళాకారులు ప్రత్యేకంగా షెడ్లు వేసుకొని విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. దీంతో పాటు గృహాల్లో పూజించుకోడానికి సుమారు 22 వేల మట్టి విగ్రహాలను వివిధ స్వచ్ఛంద, ఆధ్యాత్మిక, ప్రజా సంఘాల వారు ఉచితంగా పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఇదే కాకుండా కొన్ని చోట్ల ఉత్సవ సమితులు ప్లాస్టిక్ రహితంగా వేడుకలను నిర్వహించుకోవాలని తీర్మానం చేసుకున్నారు. మరి కొన్ని చోట్ల ప్రతి సంవత్సరం మట్టి వినాయక విగ్రహాన్నే ఏర్పాటు చేసుకొని వేడుకలు జరుపుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. శాస్త్ర పరంగా ఇది ఉత్తమ మైంది కావటంతో అటువైపుగా అడుగులు పడుతున్నాయి. ఏడాది నుంచి మట్టి వినాయక విగ్రహాలనే ఏర్పాటు చేసుకొని ఉత్సవాలు జరుపుకోవాలని బేతంచర్ల ఉత్సవ సమితి తీర్మానం చేసి ఆదర్శంగా నిలుస్తోంది.

పర్వదిన పరమార్థమిదే..

శుక్లాం భరధరం అంటూ హిందువులు తాము నిర్వహించే ప్రతి శుభకార్యానికి ముందు గణపతిని పూజ చేసి పని ప్రారంభిస్తారు. పంచ భూతాల్లో ఒక్కటైన మట్టితో చేసిన వినాయకున్ని పూజించడంతో అనేక ప్రయోజనాలు కలుగుతాయన్నది పండితుల మాట. వివిధ రకాల ఆకులు, పుష్పాల సువాసనల నుంచి మిశ్రమ వాయువులను పీల్చడం వల్ల శ్వాస సంబంధిత వ్యాధులు దూరం కావడంతో పాటు మెదడు ఉత్తేజితం అవుతుంది. ప్రకృతి సిద్ధమైన మట్టితో చేసిన గణపతి ప్రతిమలను పూజించడం తిరిగి వాటిని నీటిలో నిమజ్జనం చేయడంతో అవి నీటిలో సులువుగా కరిగి పంట పొలాలకు చేరడంతో భూములు సారవంతం అవుతాయి.

ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో పర్యావరణానికి ముప్పే

ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న భారీ వినాయక విగ్రహాల్లో దాదాపు 80 శాతం ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో తయ్యారు చేసినవే ఉంటున్నాయి. బరువు లేకుండా ఆకర్షణీయంగా కనిపించడం కోసం తయారీ దారులు ఎక్కువగా ఈ పదార్థాన్నే ఎంచుకుంటారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌కు ఆలస్యంగా కరిగే గుణం ఉంది. ప్రతిమల్లో జిప్సం, సీస, కాడ్మియం, గంధకం, మెగ్నీషియం, పాదరసం, తదితర విష రసాయనాలు ఉంటాయి. ఇవి నీటిలో చేరినప్పుడు అందులోని ఆక్సిజన్‌ను తగ్గించి ఆమ్లత్వాన్ని పెంచుతాయని పర్యావరణ నిపుణుల ప్రయోగాల్లో తేలింది.



పర్యావరణానికి ముప్పు ఇలా..

- ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ ఏళ్లు గడిచినా భూమిలో కలవదు.
- విగ్రహాలకు ఉపయోగించే రంగుల్లో సిలికా, జింక్, చాక్‌పీస్, గాజు పొడులు కలుపుతారు. ఇవి నీటిలో కలిస్తే ప్రమాదకరం.
- ఎరుపు రంగు కసం మెర్క్యూరీ సల్ఫేట్ వాడతారు. దీని వల్ల చర్మ వ్యాధులు, దద్దుర్లు వస్తాయి.
- నలుపు రంగు కోసం రెడ్ ఆక్సైడ్, కాడ్మియం, వాడతారు. వీటి వల్ల గ్రహణ శక్తి తగ్గుతుంది. మూత్ర పిండాల ఇన్‌ఫెక్షన్, పిల్లల శారీరక, మానసిక ప్రవర్తనల్లో మార్పులు వస్తాయి.
- నీలంరంగు కోసం క్రోమియం, ఆయోడైడ్ వాడుతున్నారు. వీటితో అలర్జీ, ఉబ్బసం, న్యూమోనియా లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.
- గులాబీ రంగు కోసం పొటాషియం, డైక్రోమిట్ వాడుతున్నారు. వీటితో చర్మ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.
- వినాయక నిమజ్జనోత్సవాలు, ఊరేగింపుల్లో, ఉట్టి కొట్టే సమయాల్లో రంగుల వాడకంతో కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉంది. కంటి పరమైన వ్యాధులు సోకే అవకాశం ఉంది.

సంప్రదాయ బద్ధంగా పండుగ జరుపుకుందాం



వినాయక చవితి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలి. సనాతన ధర్మంలో ప్రకృతిని పూజించే సంస్కృతి మనది. రాబోయే వినాయక చవితి నాడు మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకొని పూజించాలని సూచనలు చేస్తున్నాం. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాల ఏర్పాటును తగ్గించి పర్యావరణ హితమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని చెబుతున్నాం. ఉత్సవ సమితి ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. మట్టి వినాయక విగ్రహాల తయారీపై పోటీలు నిర్వహిస్తున్నాం
– డాక్టర్ నాగఫణి శాస్త్రి, జిల్లా సంఘటనా కార్యదర్శి, గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి

పర్యావరణ హితం అందరి అభిమతం కావాలి



వినాయక చవితి ఉత్సవాలను అందరు పర్యావరణ హితంగా జరుపుకోవాల్సిన అవసరం ఉంది. ఉత్సవ సమితి ద్వారా ప్రతినిధులకు ఇదే సూచిస్తున్నాం. ప్రజల్లో క్రమంగా మార్పు వస్తోంది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాల వాడకాన్ని తగ్గించి మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకునే దిశగా మార్పు రావటం శుభపరిణామం. –సి.బి.నారాయణరెడ్డి, నగర కార్యాధ్యక్షులు, గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి

ప్రతి సంవత్సరం మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నాం



ఆరేళ్ల నుంచి కర్నూలులో మట్టి వినాయక విగ్రహాలు తయారు చేస్తున్నాం. బంక మట్టి, ఎర్రమట్టి, వరి గడ్డి, గోనెసంచులు, వెదురు కర్రలతో వాటర్ కలర్స్‌తో విగ్రహాలను తయారు చేస్తున్నాం. 5 నుంచి 16 అడుగుల వరకు విగ్రహాలు అందుబాటులో ఉన్నాయి. రూ.10 నుంచి రూ.80 వేల వరకు డిజైన్, ఆకారం బట్టి ధర ఉంటుంది. ఇప్పటికే చాలా విగ్రహాలు బుక్ అయ్యాయి. సమాజ హితం కోసం అందరు మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది. – కెనెరాంపాల్, శిల్ప కళాకారుడు, పశ్చిమ బెంగాల్

బాల్యవివాహాల నియంత్రణకు చర్యలు

- కమిటీలు చురుకుగా వ్యవహరించాలి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ, ఎస్పీ రఘువీర్‌రెడ్డి తదితరులు

నంద్యాల: బాల్య వివాహ నిరోధక చట్టాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేసి బాల్య వివాహాలను నియంత్రించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ కమిటీ సభ్యులను, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ బాల్య వివాహాల నిరోధక చట్టంపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాల నియంత్రణకు ఏర్పాటు చేసిన గ్రామ, పట్టణ స్థాయి కమిటీలు చురుకుగా వ్యవహరించాలన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయ సిబ్బందితో పాటు అందుబాటులో ఉన్న మానవ వనరులను వినియోగించుకుని బాల్య వివాహాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 18 ఏళ్ల లోపు ఉన్న పిల్లల జాబితా అన్ని పాఠశాలల్లో అందుబాటులో ఉందని సచివాలయ సిబ్బందితో సమ్వనయం చేసుకొని వివరాలు తెలుసుకోవాలన్నా రు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరిగే గ్రామాలు, వీటికి గల మూల కారణాలను అన్వేషించి వ్యవస్థను సరిచేసేందుకు కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. చిన్న వయస్సులోనే వివాహాలు చేయడం వలన పిల్లల్లో మానసికంగా, శారీరకంగా ఎదురయ్యే సమస్యలపై తల్లిదండ్రులకు సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలను నియంత్రించడం ద్వారా మాతా, శిశు మరణాల శాతం తగ్గుతుందన్నారు. జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహాలు జరుగుతున్న కమ్యూనిటీ వర్గాలను గుర్తించి ఆయా గ్రామాల్లో సమాచారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా సుగాలి, చెంచు, బుడగజంగాలు తదితర వర్గాల్లో ఫోకస్ పెట్టి నియంత్రించాలన్నారు. సమావేశంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు జుబేదా బేగం, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ నిర్మల, బాలల సంరక్షణాధికారి శారద, అధికారులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణ వేగవంతం చేయండి

- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్‌కుమార్ మీనా

నంద్యాల: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేసి ఈనెల 15వ తేదీలోగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. మంగళవారం ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ 2024కు సంబంధించి పలు అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సంక్షిప్త సవరణకు సంబంధించి 75,259 ఓటర్లను పునః పరిశీలించి నివేదికలు సమర్పించామన్నారు. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, డోన్ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి రాజకీయ పార్టీ ప్రతినిధులు సూచించిన 27,194 బోగస్ ఓట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి తొలగించామని వివరించారు. 6,7,8 ఫామ్‌లకు సంబంధించి స్వీకరించిన 42,843 దరఖాస్తుల్లో 18,433 ఓటర్ జాబితాలో పొందుపరిచామని పెండింగ్‌లో ఉన్న 21,989 క్లెయిమ్స్‌ను నాలుగు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. డూప్లికేట్, షిఫ్టెడ్, డెత్ ఓటర్లకు సంబంధించి 47,432 ఓట్లను జాబితాలో సవరించామన్నారు. ఇంటింటి సర్వేలో 10,936 ఓటర్లు కొత్తగా నమోదు చేసుకున్నారన్నారు. జంక్ క్యారెక్టర్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 105 ఓటర్లను, 10 కంటే ఎక్కువ ఓట్లు ఉండి పెండింగ్‌లో ఉన్న 3,908 గృహాలను క్షేత్రస్థాయిలో పునః పరిశీలించి జాబితాలో పొందుపరుస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలోని సవరణలు, జంక్ క్యారెక్టర్స్, చేర్పులు మార్పులు తదితరాలకు సంబంధించి వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఈ నెల 15 తేదీ లోగా స్వచ్ఛమైన, పారదర్శకమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఈఆర్ఓ, ఏఈఆర్వోలను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ పుల్లయ్య, ఈఆర్ఓలు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ మెయిన్ పరీక్షకు 426 మంది ఎంపిక

కర్నూలు: కర్నూలు ఏపీఎస్పీ రెండో పటాలంలో 13వ రోజు ఎస్ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్, ఎస్పీ కృష్ణకాంత్, సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ పర్యవేక్షణలో మంగళవారం జరిగిన ఈ పరీక్షలకు 617 మంది హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం శారీరక సామర్థ్య పరీక్షలు, 1600, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు. వాటిలో 426 మంది ప్రతిభ కనబరిచి ఎస్ఐ మెయిన్స్ (తుది పరీక్ష) కు అర్హత సాధించారు.



ఎస్ఐ అభ్యర్థి ఎత్తును కొలుస్తున్న దృశ్యం

శ్రీశైలంలో 92 టీఎంసీలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 92.0480 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూరాల నుంచి 11,363 క్యూసెక్కుల వరద ప్రవాహం శ్రీశైలానికి వచ్చి చేరుతుంది. సోమవారం నుంచి మంగళవారం వరకు దిగువ ప్రాంతాలకు 6,234 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 0.707 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి 1,357 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేశారు. పోతిరెడ్డిపాడు ద్వారా 2 వేల క్యూసెక్కులు విడుదల చేశారు.

విద్యుత్ శాఖలో పలువురికి పదోన్నతులు, బదిలీలు

కర్నూలు కల్చరల్: దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్)లో పలువురు ఇంజినీర్లకు పదోన్నతులు కల్పిస్తూ, బదిలీలు చేస్తూ ఎస్పీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఓర్వకల్ ఏఈ ప్రసాద్‌రెడ్డిని తిరుపతి కార్పొరేట్ కార్యాలయానికి, ఎస్పీఎం డీఈఈ పరిశుద్ధరావును శ్రీకాళహస్తికి, పత్తికొండ డీఈఈ రామకృష్ణను ఎస్పీఎం డీఈఈగా, దేవనకొండ డీఈఈ ఖాజావలిని పత్తికొండ డీఈఈగా, నంద్యాల సీటీ మీట ర్స్ ఏఈ మద్దిలేటిని బనగాపల్లెకు, కర్నూలు డివిజన్ ఈఈ రమేష్‌ను వైఎస్సార్ కడప ఎంఅండ్‌పీ ఈఈగా, ఎస్పీడీసీఎల్ తిరుపతి కార్పొరేట్ కార్యాలయం ఈఈ చక్రపాణిని కర్నూలు డివిజన్ ఈఈగా బదిలీ చేశారు. కర్నూలు డి–2 డీఈఈగా ఉన్న ఓబులేసుకు ఈఈగా పదోన్నతి కల్పించి కర్నూలు సర్కిల్ కార్యాలయం టెక్నికల్ ఈఈగా, ఆత్మకూరు ఏఈ రమేష్‌కు డీఈఈగా పదోన్నతి కల్పించి కర్నూలు డి–2 డీఈఈగా పోస్టింగ్ ఇచ్చారు.

ముందస్తు రబీ

పెరిగిన అన్నదాతల ఆశలు

- ముమ్మరంగా జొన్న, మొక్కజొన్న, పొగాకు, వాము పంటలు
- ఖరీఫ్‌లో 77.85 శాతమే పంటల సాగు
- రబీ సాగుపై ఖరీఫ్ రైతుల దృష్టి
- 13,650 క్వింటాళ్ల శనగ విత్తనాల కేటాయింపు
- నంద్యాల ఆర్ఏఆర్ఎస్‌లో సిద్ధం
- నేడు కర్నూలుకు రానున్న ఏపీ సీడ్స్ ఎండీ



కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇటీవల వర్షాలు విస్తారంగా కురవడంతో రబీపై అన్నదాత ఆశలు చిగురించాయి. ఇప్పటికే ముందస్తు సాగు మొదలైంది. ఆ మేరకు ప్రభుత్వం కూడా సబ్సిడీపై విత్తనాల ముందస్తు పంపిణీకి ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ విత్తన అభివృద్ధి సంస్థ(ఏపీ సీడ్స్) మేనేజింగ్ డైరెక్టర్ శేఖర్‌బాబు బుధవారం కర్నూలులో సమీక్ష నిర్వహించనున్నారు. ఖరీఫ్ సాధారణ సాగు 4.21 లక్షల హెక్టార్లు ఉండగా.. ఇప్పటి వరకు 3.28 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ప్రధానంగా ఖరీఫ్‌లో పత్తి సాదారణ సాగు 2,50,827 హెక్టార్లు ఉండగా.. 1,83,640 హెక్టార్లలో సాగయింది. సీజన్‌లో వర్షాలు ఆలస్యం కావడమే ఇందుకు ప్రధాన కారణం. అందువల్ల ఉమ్మడి జిల్లాలో రబీ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం ఏర్పడింది. ప్రతి ఏటా పత్తి సాగు చేసే రైతులు వర్షాలు ఆలస్యం కావడం వల్ల జొన్న, వాము, మొక్కజొన్నపై దృష్టి సారిస్తున్నారు. ప్రభుత్వం కూడా రబీలో ముందస్తుగా వివిధ పంటల సాగును ప్రోత్సహిస్తోంది. ఏపీ సీడ్స్ ఇప్పటికే రబీ పంటల సాగుకు అవసరమైన విత్తనాలను సిద్ధం చేస్తోంది.

చురుగ్గా ముందస్తు రబీ పంటల సాగు

జిల్లా వ్యాప్తంగా ముందస్తు రబీ పంటల సాగు చురుగ్గా జరుగుతోంది. శనగ ఈ నెల చివరి వారం నుంచి సాగు మొదలవుతుంది. ఇప్పటికే కొద్ది రోజులుగా ముందస్తు రబీ కింద జొన్న, మొక్కజొన్న, పొగాకు, పొద్దుతిరుగుడు వంటి పంటల సాగు ఊపందుకుంది. జిల్లాలో వాము రబీలో వేస్తారు. ఈ సీజన్ అక్టోబర్ 1 నుంచి మొదలవుతుంది. సెప్టెంబర్ 12 నాటికి జిల్లాలో వాము 750 ఎకరాల్లో సాగవడం విశేషం.

రబీలో ప్రధాన పంట శనగ

రబీ సీజన్‌లో పండించే పంటలలో శనగ ప్రధానమైంది. ఉమ్మడి జిల్లాలో 2.20 లక్షల హెక్టార్ల వరకు సాగు ఉంటోంది. ఆలూరు, కోవెలకుంట్ల, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, నందికొట్కూరు, కర్నూలు సబ్ డివిజన్‌లలో నల్ల రేగడి నేలలు ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పోలిస్తే రబీ పంటల సాగు విస్తీర్ణం ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే ఎక్కువగా ఉంటోంది. నల్ల రేగడి నేలల్లో ప్రధానంగా శనగ సాగు ఎక్కువగా ఉంటోంది. కేవలం శనగ సాగు కోసమే నల్ల రేగడి నేలలను ఖరీఫ్‌లో ఖాళీగా ఉంచుకొని రబీలో ముందస్తుగా శనగ సాగు చేస్తారు. ఈ సారి సెప్టెంబర్ నెలలో వర్షాలు ఎక్కువగా పడటం రబీపై ఆశలు పెంచింది.

నంద్యాల ఆర్ఏఆర్ఎస్‌లో శనగ విత్తనాలు

రబీ సీజన్‌లో శనగ సాగుకు రంగం సిద్ధమైన నేపథ్యంలో నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వివిధ రకాల శనగ విత్తనాలను సిద్ధం చేసింది.

- దేశవాళి రకాల్లో నంద్యాల గ్రామ్ 452, 857, 776 ముఖ్యమైనవి.
- కాబూలీ రకాల్లో నంద్యాల గ్రామ్ 119,810 రకాల ముఖ్యమైనవి.
- ఇవే కాకుండా ఎన్‌బిజి–779 అనే దేశవాళి రకం కూడ అందుబాటులో ఉంది. ఇది యంత్రంతో కోతకు అనువైన రకం.
- శనగ సాధారణంగా జేజీ–11 ఎక్కువగా సాగు చేస్తారు.
- అభ్యుదయ రైతులు కొత్త, కొత్త రకాలతో సాగు చేస్తుండటం విశేషం.

13,650 క్వింటాళ్ల శనగ విత్తనం కేటాయింపు

రబీ సీజన్‌లో శనగ సాగుకు ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేసేందుకు 13,650 క్వింటాళ్ల జేజీ–11 రకం శనగ(బెంగాల్ గ్రామ్) విత్తనాలు కేటాయించింది. శనగ విత్తనాలకు డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నందున జిల్లాకు మరో 5వేల క్వింటాళ్ల శనగ విత్తనాలు కేటాయించాలని జిల్లా వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. రబీ సీజన్‌లో బావులు, బోర్లు, ఇతర నీటిపారుదల కింద వేరుశనగ కూడా ఎక్కువగా సాగు చేస్తారు. గత ఏడాది రబీలో కూడా వేరుశనగను 40 శాతం సబ్సిడీపై పంపిణీ చేశారు. ఈ సారి కూడా సబ్సిడీపై పంపిణీ చేసేందుకు 7,500 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు కేటాయించాలని జిల్లా వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. జిల్లాలో విస్తారంగా వర్షాలు పడటంతో వ్యవసాయ శాఖ ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించింది. మండలాల వారీగా ప్రత్యామ్నాయ పంటలు అంటే జొన్న, ఉలువలు, కొర్రలు ఏఏ మండలాల్లో సాగు చేస్తారు. విత్తనాలు ఎంత అవసరమనే విషయమై డిమాండ్ తీసుకొని 80 శాతం సబ్సిడీపై పంపిణీ చేసేలా ప్రతిపాదనలు పంపారు.

విత్తనాలు సిద్ధం చేస్తున్నాం



రబీ పంటల సాగుకు ముందస్తుగా విత్తనాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ప్రభుత్వం జిల్లాకు 13, 650 క్వింటాళ్ల జేజీ–11 రకం శనగ విత్తనాలను కేటాయించింది. ఈ సారి రబీలో శనగ సాగు పెరుగుతున్నందున జిల్లాకు మరో 5వేల క్వింటాళ్లు అదనంగా కేటాయించాలని కోరాం. ఈ నెల 4వ వారం నుంచి సాగు మొదలవుతుంది. రబీ పంటల సాగుకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయి.
– పీఎల్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి, కర్నూలు

క్లుప్తంగా

నేటి నుంచి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

కర్నూలు(టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్ డోర్ స్టేడియంలో ఈనెల 13న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ కార్యదర్శి సి.సుబ్బరత్నాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14, అండర్–16, అండర్–18, అండర్–20.. అలాగే 23 వయస్సు కలిగిన సీనియర్ స్థాయిల్లో బాల బాలికలకు ఈ పోటీలు ఉంటాయన్నారు. అండర్–14, అండర్–16 విభాగాల పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన బాల బాలికలకు మెడల్స్, సర్టిఫికెట్లు.. అలాగే అండర్–18, అండర్–20, అండర్–23 విభాగాల పోటీల్లో సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ప్రతిభ చాటిన క్రీడాకారులు ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొంటారని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనన ధృవీకరణ పత్రంతో హాజరు కావాలని, ఇతర వివరాలకు 8919409232 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఈ నెల చివరిలోపు ఈ-క్రాప్ నమోదు పూర్తి

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ పంటల నమోదు ప్రక్రియ ఈ నెల చివరిలోపు పూర్తి చేసేందుకు వ్యవసాయ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ ఆదేశించారు. మంగళవారం గుంటూరు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ–క్రాప్ బుకింగ్, ఆర్‌బీకేల ద్వారా ఎరువుల పంపిణీ, పీఎం కిసాన్ ఈ–కేవైసీ తదితర వాటిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 30 నాటికి ఆర్‌బీకేల్లో ఈ–క్రాప్ నమోదు వివరాలను సిద్ధం చేయాలన్నారు. సచివాలయాల వారీగా ఉన్న రైతు భరోసా కేంద్రాల సిబ్బందిని త్వరలో రేషనలైజేషన్ చేయనున్నట్లు తెలిపారు. పీఎం కిసాన్ కింద 100 శాతం ఈ–కేవైసీ పూర్తి చేయించాలని సూచించారు. కర్నూలు నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, ఏడీఏలు సాలురెడ్డి, మహమ్మద్ ఖాద్రీ, గిరీష్, సునీత తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య

రుద్రవరం: అత్తింటి వేధింపులు తాళలేక మండల కేంద్రమైన రుద్రవరానికి చెందిన నాసారి వెంకటలక్ష్మి(32) ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ శరత్‌కుమార్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. శిరివెళ్ల మండలం మహదేవపురానికి చెందిన వెంకటలక్ష్మికి, రుద్రవరానికి చెందిన సుబ్బరాయుడుతో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం ఉన్నారు. కొంత కాలంగా భర్త సుబ్బరాయుడు, అత్త వెంకటలక్ష్మమ్మ, మరిది నాగేంద్ర వేధించడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. మంగళవారం తెల్లవారు జామున రసాయన ద్రావణాన్ని తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి సబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టు మార్టం చేయించామన్నారు.

టీడీపీ కార్యకర్తపై అత్యాచార యత్నం కేసు నమోదు

కృష్ణగిరి: మండల పరిధిలోని తొగర్చేడు గ్రామానికి చెందిన బోయ కోతుల రామానాయుడుపై మంగళవారం అత్యాచారయత్నం కేసు నమోదైంది. ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 8వ తేదీ రాత్రి సుమారు 9 గంటల సమయంలో ఇదే గ్రామానికి చెందిన ఓ వివాహిత ఇంట్లోకి బోయ కోతుల రామానాయుడు ప్రవేశించి అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో ఇంటి పక్కల ఉన్న వారు వచ్చారు. వారిని చూసి రామానాయడు అక్కడి నుంచి పరారయ్యారు. ఇతను పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి భర్త చెరుకులపాడు నారాయణరెడ్డి హత్య కేసులో ఏ–2 ముద్దయిగా ఉన్నారు. దీంతోపాటు ఇతనిపై పలు కేసులు ఉండటంతో పీడీ యాక్ట్ కింద వైఎస్సార్ కడప సెంట్రల్ జైలులో ఆరు నెలలు శిక్ష అనుభవించి మూడు నెలల క్రితం ఇంటికి వచ్చాడు. ఇంతలోనే మహిళపై ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బడిలో హల్‘సెల్’కు అడ్డుకట్ట

- తరగతి గదుల్లో మొబైల్ ఫోన్ల వాడకం నిషేధం
- ఉపాధ్యాయులు, విద్యార్థుల ఏకాగ్రత దెబ్బతినకుండా ప్రభుత్వం నిర్ణయం
- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ కమిషనర్
- డీఈఓ, డీవైఈఓ, ఎంఈఓలకు పర్యవేక్షణ బాధ్యతలు



నంద్యాల(న్యూటౌన్): దేశ భవిష్యత్ తరగతి గది నాలుగు గోడల మధ్య నిర్మితమవుతుందని చెబుతున్నామంటే సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో విలువైనది. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులు క్రమ శిక్షణకు మారుపేరుగా నిలవాల్సిన అవసరం ఉంది. అయితే ఇటీవల మానవ జీవితంలో భాగమైన స్మార్ట్‌ఫోన్లను ఉపాధ్యాయులు తరగతి గదుల్లో వాడడంతో బోధనపై తీవ్ర ప్రభావం పడుతుందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. తరగతి గదుల్లో మొబైల్ ఫోన్లు వాడరాదని ప్రధానోపాధ్యాయులు పదే పదే చెబుతున్నా కొందరు విస్మరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశంపై విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తరగతిగదుల్లో సెల్ ఫోన్ల వాడకాన్ని నిషేధించింది. ఈ మేరకు విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను పకడ్బందీగా అమలు చేయాలని ఆర్‌జేడీ, డీఈవో, డైట్ కళాశాల ప్రిన్సిపాళ్లను ఉన్నతాధికారులు ఆదేశించారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా 1,409 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 6,755 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు వృత్తిపరమైన అవసరాలకు కాకుండా కొందరు వ్యక్తిగత అవసరాలకు మొబైల్ ఫోన్లను తరచూ ఉపయోగిస్తున్నారు. దీంతో బోధన సమయంలో అంతరాయం ఏర్పడటంతో పాటు ఏకాగ్రత తప్పే అవకాశం ఉంది. అలాగే ఇదే క్రమంలో కొందరు విద్యార్థులు కూడా సెల్‌ఫోన్లు తీసుకురావడం, ఆకతాయి చేష్టలకు పాల్పడంతో వారి భవిష్యత్ దెబ్బతినే ప్రమాదం ఉంది. తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం తరగతి గదుల్లో మొబైల్ ఫోన్ల వినియోగంపై నిషేధం విధించింది. ప్రభుత్వ నిర్ణయం పట్ల విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అనుమతి లేకుండా సెల్ ఉపయోగిస్తే..

- ఉపాధ్యాయులు పాఠశాలకు చేరుకున్న వెంటనే మొబైల్ ఫోన్‌లోని యాప్లో ఫేస్ అటెండెన్స్ నమోదు చేసిన అనంతరం ఫోన్లను ప్రధానోపాధ్యాయుల గదిలో లేదా పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్ (గుమాస్తా) వద్ద డిపాజిట్ చేయాలి.
- అత్యవసరం అయితే హెచ్‌ఎం అనుమతితో ఉపయోగించాలి.
- ఉపాధ్యాయుడు పాఠశాల పని వేళలకు ముందు, పనివేళల తర్వాత మాత్రమే ఫోన్లను వినియోగించాలి.
- నిబంధనలు అతిక్రమించి అనమతి లేకుండా తరగతి గదిలో ఎవరైనా ఫోన్ వినియోగించినట్లు మొదటిసారి గుర్తిస్తే పాఠశాల హెడ్‌కు రాత పూర్వక సంజాయిషీ ఇవ్వాల్సి ఉంటుంది. రెండవసారి వినియోగిస్తే మొబైల్ ఫోన్‌ను హెచ్‌ఎం తీసుకుని పాఠశాల ముగిసే వరకు హెచ్‌ఎం వద్ద ఉంచుకోవాల్సి ఉంటుంది. అనంతరం ఈ విషయాన్ని మండల విద్యా శాఖాధికారి దృష్టికి హెచ్‌ఎం తీసుకెళ్లాలి.
- మూడవ సారి కూడా నిబంధనలు అతిక్రమిస్తే సంబంధిత ఉపాధ్యాయుడి మొబైల్ ఫోన్ ఉపయోగిస్తే స్వాధీనం చేసుకుని డీఈఓకు పంపిస్తారు. జిల్లా విద్యాశాఖాధికారి హెచ్చరిక అనంతరం ఆ విషయాన్ని ఉపాధ్యాయుని సర్వీస్ రిజిస్టర్‌లో రాసిన అనంతరం ఫోన్‌ను తిరిగి ఇస్తారు.
- ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తరగతి గదుల్లో ఫోన్లు వినియోగించకుండా నిరంతరం పర్యవేక్షణ చేయాలి.
- ఉపాధ్యాయులు తరగతి గదుల్లో మొబైల్ ఫోన్లను వినియోగిస్తున్నట్లు విద్యార్థులు, ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే పాఠశాల హెచ్‌ఎంలను బాధ్యులను చేసి చర్యలు తీసుకుంటారు.

పాఠ్యాంశాల బోధనకు అవసరమైతే..

జిల్లాలో చాలా పాఠశాలల్లో విద్యాబోధన కోసం ప్రభుత్వం ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, స్మార్ట్ టీవీలు, ట్యాబ్‌లను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో బోధనకు మొబైల్ ఫోన్‌ను ఉపయోగించాలని భావిస్తే దాని ప్రయోజనాన్ని ఉపాధ్యాయుడు కచ్చితంగా నమోదు చేయాలి. ప్రధానోపాధ్యాయుడి ఆమోదం తీసుకోవాలి. అకడమిక్ లేదా నాన్ అకడమిక్ ప్రయోజనం కోసం తరగతి గదికి ఫోన్‌ను తీసుకుని వెళ్లాల్సి వస్తే సరైన కారణాన్ని పేర్కొని ఆ వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలి.

ఉత్తర్వులు కచ్చితంగా పాటించాలి



తరగతి గదుల్లో సెల్‌ఫోన్ వినియోగం వలన బోధనపై తీవ్ర ప్రభావం పడుతుంది. పాఠశాలల్లో అంతరాయం లేకుండా, ఉపాధ్యాయుల, ఏకాగ్రత దెబ్బతినకుండా బోధన ప్రక్రియ సజావుగా సాగడానికే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉత్తర్వులను ఉపాధ్యాయులు కచ్చితంగా పాటించాలి. పాఠశాలల్లో సెల్‌ఫోన్లను నిషేధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు పాఠశాలలకు చేరవేశాం.

– సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. ‘అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా’ అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.

శిబిరం చిరునామా

కర్నూలులో..
మాంటిస్సోరి స్కూల్,
ఏ.క్యాంప్, కర్నూలు
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన
ఫోన్ నంబరు : 97053 47392

నంద్యాలలో..
శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్,
ఎన్‌జీఓ కాలనీ, లలితా నగర్, నంద్యాల
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన
ఫోన్ నంబరు : 99122 20581

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతుడు బోయ నాగరాజు(ఫైల్)

కోడుమూరు: ప్రమాదవశాత్తు వేలాడుతున్న కరెంట్ తీగలు తగిలి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం కోడుమూరులో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని పెద్దబోయగేరికి చెందిన బోయ నాగరాజు (38) హమాలీ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. మంగళవారం మధ్యాహ్నం బహిర్భూమికై వెంకటగిరి రోడ్డులోని ఖాళీ స్థలాల్లోకి వెళ్లగా అక్కడ వేలాడుతున్న కరెంట్ తీగలు ప్రమాదవశాత్తు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కోడుమూరు ఎస్‌ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తర్వాత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతిచెందిన హమాలీ కుటుంబానికి న్యాయం చేయాలంటూ హమాలీ సంఘం నేతలు స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో కొద్దిసేపు ఆందోళన నిర్వహించారు. మృతుడు నాగరాజుకు భార్య మద్దమ్మతో పాటు, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం.

ఏడు మండలాల్లో ఒక మోస్తరు వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని వివిధ మండలాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. సోమవారం సాయంత్రం నుంచి మంగళవా రం ఉదయం వరకు జిల్లా మొత్తంగా సగటున 2.5 మి.మీ వర్షపాతం నమోదైంది.సెప్టెంబర్ నెల సాధారణ వర్షపాతం 116.5 మి.మీ ఉండగా ఇప్పటి వరకు 70.4 మి.మీ వర్షం కురిసింది. రానున్న ఐదు రోజుల్లో జిల్లాలోని వివిధ మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించింది.

ప్రాంతం	వర్షపాతం(మి.మీ.)
పెద్దకడుబూరు	20.6
మంత్రాలయం	10.4
కోసిగి	9.2
కౌతాళం	8.2
సి.బెళగల్	7.2
గూడూరు	4.2
ఎమ్మిగనూరు	3.4
ఆదోని	1.2

క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యత

- స్పోర్ట్స్ అథారిటీ సీఈఓ రమణ
- కర్నూలు మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు ప్రారంభం



ఎస్‌జీఎఫ్ పోటీల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ రమణ

కర్నూలు (టౌన్) : క్రీడలకు ప్రభుత్వ అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, స్కూల్‌గేమ్స్ క్రీడా పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులకు ప్రోత్సాహం కూడా అందిస్తుందని స్పోర్ట్స్ అథారిటీ సీఈఓ రమణ అన్నారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో కర్నూలు మండల స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను సీఈఓ ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం క్రీడా రంగానికి పెద్ద పీట వేస్తుందన్నారు. ప్రతి ఏడాది స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్కూల్, కళాశాల, యూనివర్సిటీ స్థాయిలో బాల బాలికలకు పోటీలు నిర్వహిస్తుందన్నారు. ప్రతిభ చాటే క్రీడాకారులకు స్పోర్ట్స్ అథారిటీ అండగా నిలుస్తుందని చెప్పారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య మాట్లాడుతూ వాలీబాల్, కబడ్డీ, ఖో–ఖో, త్రోబాల్, బాల్ బాడ్మింటన్, షటిల్ బాడ్మింటన్, యోగ, అథ్లెటిక్స్, టెన్నికాయిట్ వంటి పాఠశాలల క్రీడా పోటీల్లో సత్తాచాటాలన్నారు. మండల స్థాయి క్రీడా పోటీల్లో రాణించిన వారు వచ్చే నెల నిర్వహించనున్న జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో క్రీడల ఇన్‌చార్జ్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని..
- ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించిన భార్య
- హత్య కేసు మిస్టరీని ఛేదించిన పోలీసులు
- ఏడుగురు నిందితుల అరెస్ట్

ప్రియుడి మోజులో దారుణం



నిందితులను చూపుతున్న ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి



నిందితుడు రవీంద్ర

బొమ్మలసత్రం: వివాహేతర సంబంధం ఓ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. సాఫీగా సాగిపోతున్న కుటుంబంలో మహిళ దారి తప్పి చివరకు భర్తనే దారుణంగా హత్య చేయించింది. తండ్రి హత్యకు గురికావడం, తల్లి జైలుకెళ్లడంతో ఇద్దరు చిన్నారులు అనాథలుగా మిగిలిపోయారు. ఈనెల 4వ తేదీన నంద్యాల పట్టణ శివారులోని అయ్యలూరు మెట్ట వద్ద జరిగిన ప్రైవేటు ఉపాధ్యాయుడు హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఈ కేసులో దారుణానికి పాల్పడిన ఏడుగురి నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం ఎస్పీ రఘువీర్‌రెడ్డి తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామానికి చెందిన సిందే నర్సోజీకి వైఎస్సార్ జిల్లా రాయచోటికి చెందిన జయశ్రీతో పదేళ్ల క్రితం వివాహమైంది. నర్సోజీ అయ్యలూరు మెట్ట వద్ద ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. జయశ్రీ(27) గ్రామంలో ఇంటి ఎదురుగా తనకంటే ఐదేళ్ల వయస్సు తక్కువగా ఉన్న రవీంద్ర (22) అనే యువకుడితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. రవీంద్ర కొబ్బరి తాళ్లు నేస్తున్నాడు. వీరి మధ్య ఆరేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగుతుంది. అయితే నెల క్రితం వీరిద్దరి వ్యవహారాన్ని తెలుసుకున్న నర్సోజీ పద్ధతి మార్చుకోవాలని భార్యను మందలించాడు. రవీంద్రను ఇకపై తన ఇంటి పరిసరలా వైపు రావద్దని హెచ్చరించాడు. దీంతో వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను అంతమొందించాలని ప్రియుడితో కలసి జయశ్రీ కుట్ర పన్నింది.

స్కూల్ నుంచి తిరిగి వస్తుండగా..



భర్త సిందే నర్సోజీతో జయశ్రీ

నర్సోజీని హత్యచేయాలని జయశ్రీ, ప్రియుడు రవీంద్ర పథకం వేశారు. రవీంద్ర స్నేహితులైన మహదేవాపురం గ్రామానికి చెందిన గుండపోగుల రాజేష్, బసాపురం గ్రామానికి చెందిన కాలె వెంకటరమణ, నక్క చిన్న నరసింహులు, నల్లబోతుల వెంకటేశ్వర్లు, పెద్ద కొట్టాలకు చెందిన జజ్జం నాగేంద్రకు విషయం చెప్పి హత్యకు కుట్ర పన్నారు. ఈనెల 4వ తేదీ సాయంత్రం అయ్యలూరిమెట్ట సమీపంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో విధులు ముగించుకుని బైక్‌పై తిరిగి వస్తుండగా నర్సోజీ తలపై వెనుక నుంచి గొడ్డలితో దాడి చేశారు. ప్రాణాలు దక్కించుకునేందుకు నర్సోజీ పారిపోతుండగా గొడ్డలితో తలపై నరికి హత్య చేసి నిందితులు పరారయ్యారు. మృతుడి తల్లి రామబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన నంద్యాల తాలూకా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. భార్యను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు నిజం బయటపెట్టింది. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితులను మంగళవారం అరెస్ట్ చేసి వారి నుంచి గొడ్డలిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు పర్యవేక్షణలో డీఎస్పీ మహేశ్వరరెడ్డి, సీఐ దస్తగిరి బాబు, ఎస్‌ఐ నాగరాజు, సిబ్బంది చాకచక్యంగా నిందితులను పట్టుకోవటంతో ఎస్పీ వారిని అభినందించారు.

15 నుంచి ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే

- 30 నుంచి వైద్యశిబిరాలు
- స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో ఈ నెల 15వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కోసం ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన ప్రోగ్రామ్ అధికారులతో డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర శాఖల సమన్వయంతో ప్రజలకు వారి ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. మొదటి విడతగా ఇంటింటి సర్వే చేసి ప్రజల జబ్బులు/ అవసరాలను అంచనా వేస్తూ, రెండవ విడతలో హెల్త్‌క్యాంపులు నిర్వహించి వారి వారి జబ్బులను బట్టి చికిత్స చేయడం, అవసరాన్ని బట్టి ఉన్నత వైద్యానికి రెఫర్ చేస్తారన్నారు. ఈ నెల 15వ తేది నుంచి ప్రారంభం కానున్న ఇంటింటి సర్వేలో భాగంగా వలంటీర్లు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని ప్రజలకు తెలియజేస్తారన్నారు. ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు ఇంటింటి సర్వే చేసి జబ్బులు ఉన్న దీర్ఘకాలిక, అంటువ్యాధులు ఉన్న వారి వివరాలు సేకరించి మెడికల్ క్యాంపు ఉన్న చోటికి వారందరినీ హాజరుపరుస్తారన్నారు. సర్వే అయిన తర్వాత 30వ తేది నుంచి మెడికల్ క్యాంపులు నిర్వహిస్తారన్నారు. ప్రతిరోజూ ప్రతి మండలంలో ఒక క్యాంపు యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో నిర్వహిస్తారని ఆయన చెప్పారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 456 క్యాంపులు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఆర్. మాధవి, డీఎల్‌ఏటీఓ డాక్టర్ భాస్కర్, డీఐఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, ఎఫ్‌డీపీ నోడల్ అధికారి డాక్టర్ బాలమురళీకృష్ణ, ఎన్‌హెచ్‌ఎం సెక్షన్ డీపీఎంఓ డాక్టర్ ఉమా, డీపీఎం డీబీసీఎస్ డాక్టర్ భరత్, ఆర్‌బీఎస్‌కే సమన్వయకర్త హేమలత, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ భాస్కరరెడ్డి, డెమో ప్రమీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

బాలిక బలవన్మరణం



మృతి చెందిన బోయ అనిత

నందవరం: తల్లి మందలించిందని బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం ధర్మపురం గ్రామంలో చోటు చేసుకుంది. బోయ లక్ష్మికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. భర్త నరసింహులు నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. పదోతరగతి వరకు చదివిన చిన్న కుమార్తె అనిత (15) కూడా తల్లితో పాటు కూలిపనికి వెళ్తుంది. అయితే, కుమార్తె ఎక్కువగా ఫోన్‌లో మాట్లాడుతూ ఉండటంతో మందలించి ఆమె ఒక్కరే పనికి వెళ్లారు. మనస్తాపం చెందిన అనిత మధ్యాహ్నం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు తల్లి లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపారు.

యువతకు ఉద్యోగావకాశాల కల్పనే లక్ష్యం

- వైఎస్‌ఆర్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి
- ఎమ్మిగనూరులో మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్ మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య తదితరులు



జాబ్‌మేళాకు హాజరైన యువతీయువకులు

ఎమ్మిగనూరు టౌన్: చదువుకున్న యువతీయువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని వైఎస్‌ఆర్‌సీపీ రీజనల్ కో– ఆర్డినేటర్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాలలో ఆ విద్యాసంస్థ యాజమాన్యం, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్తంగా మెగా జాబ్‌మేళా నిర్వహించాయి. ఈ మేళాను జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, పార్టీ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘుతో కలిసి వారు ప్రారంభించారు. అనంతరం యువతీ, యువకులను ద్దేశించి వారు మాట్లాడారు. పేదల విద్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన తదితర పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పోటీ ప్రపంచంలో రాణించేందుకు ఇంగ్లిషు మీడియంతో పాటు సాంకేతిక విద్యను అందుబాటులోకి తెచ్చారన్నారు. విదేశాల్లో చదువుకునే విద్యార్థులకు ఆర్థిక సహకారం అందజేస్తున్నారని చెప్పారు. అధికారంలోకి రాగానే ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు భర్తీ చేసిందన్నారు. దీంతో పాటు విద్యార్హతను బట్టి ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి చూపుతుందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో యువతకు ఎలాంటి వృతి నైపుణ్య శిక్షణ ఇవ్వకుండా నిధులు కొల్లాగొట్టారని, ఇదే కేసులో ప్రస్తుతం జైలుకు వెళ్లారని చెప్పారు. కాగా జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగుల్లో 260 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు రావూస్ కాలేజీ కరస్పాండెంట్ తిరుమల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ సీతారామయ్య, డీఆర్‌డీఏ పీడీ నాగలీల, తహసీల్దార్ ఆంజినేయులు, స్కిల్‌డెవలప్‌మెంట్ జిల్లా అధికారి శ్రీకాంత్‌రెడ్డి, వైకేపీ ఏరియాకో ఆర్డినేటర్ శ్రీనివాసులు, వివిధ కంపెనీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.